సాక్షి
కాకినాడ
మంగళవారం । 29 । ఆగస్టు । 2023



అన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వీవీఎస్ఎస్ యశ్వంత్ (కడియం మండలం) సోమవారం రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు.



గోవిందా హరి గోవిందా..

కోనసీమ తిరుపతి.. వాడపల్లి దివ్యక్షేత్రం.. భక్తుల గోవింద నామోచ్ఛారణతో మార్మోగింది. ఇక్కడి స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. -8లో▸

సముద్రంలోకి 2.70 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 2,70,529 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 362 అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అందిన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, ఇన్‌ఛార్జి డీఆర్వో, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, సీపీవో పి త్రినాథ్, సివిల్ సప్లయిస్ డీఎం పుష్పమణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీతలతో కలిసి ఆమె హాజరయ్యారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పరిష్కరించాల్సింగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరా సేవలు, నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 362 అర్జీలు వచ్చాయి.

ఈటీసీలో ఢిల్లీ బృందం పర్యటన


జి.రాగంపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రాన్ని ఢిల్లీలోని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం సోమవారం పరిశీలించింది. ఈ కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను అడిగి తెలుసుకున్నారు. ఈటీసీ సమీపంలోని జగనన్న స్వచ్ఛ సంకల్పం మోడల్ గ్రామం జి.రాగంపేటను ఆ బృందం సందర్శించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, అందులోని తడి, పొడిచెత్తల నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. అలాగే ఆ యూనిట్‌లో వర్మీ కంపోస్టు ద్వారా పెరిగిన మొక్కలను, యూనిట్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజా విరాళాలతో చెరువు వద్ద ఏర్పాటు చేసిన పార్కు అభివృద్ధి, బోటింగ్ పనులపై అధికారులను, పాలక మండలిని అభినందించారు. డీపీఓ ఆర్.విక్టర్, నోడల్ టీమ్ అధికారులు బాలామణి, ఎంఎస్ఎన్ రెడ్డి, కుమార్‌రాజా, పంచాయతీ సర్పంచ్‌లు వారి వెంట ఉన్నారు.

జెడ్పీ స్కూళ్లలో కారుణ్య నియామకాలు


కారుణ్య నియామక, పదోన్నత ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

కాకినాడ సిటీ: జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలోని మండల పరిషత్ కార్యాలయాల్లోను, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ అనారోగ్య కారణాల వల్ల మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులు 10 మందికి కారుణ్య నియామకాలు కింద సోమవా రం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డిలు నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరిలో ఏడుగురిని జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోను ముగ్గురిని టైపిస్టు పోస్టుల్లో నియమిస్తూ కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న నలుగురు రికార్డు అసిస్టెంట్లకు జూని యర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ నియామకపు ఉత్తర్వులు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అందించారు. 14 జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులకు సంబంధించి ఉత్తర్వులు ఇచ్చిన ట్లు తెలిపారు. జిల్లాపరిషత్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు పదోన్నతులు, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేయడంపై ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ వీవీ రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు మంత్రి అప్పలరాజు రాక

కాకినాడ సిటీ: రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం కాకినాడ రానున్నారు. పలాస నుంచి రోడ్డు మార్గంలో ఆయన కాకినాడకు రానున్నారు. కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ నుంచి రోడ్డు మార్గంలో పలాస వెళ్తారు.

చైతన్య దీప్తికి చిరునామా

- దివ్యాంగ బాలలకు బాసటగా భవిత కేంద్రాలు
- మానసిక కుంగుబాటును తరిమేందుకు నిరంతర కృషి
- దృష్టి,వినికిడి లోప బాధితులకు ట్యాబ్‌లు పంపిణీ
- ప్రభుత్వ కృషితో ఉత్తమ ఫలితాలనిస్తున్న కేంద్రాలు




భవిత కేంద్రంలో సహిత విద్య నేర్పుతూ.... దివ్యాంగ బాలలకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ (ఫైల్)



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మానసిక ఎదుగుదల లేని పిల్లలకు భవిత కేంద్రాలు కొండంత అండగా నిలుస్తున్నాయి. ఇలాంటి పిల్లలు పుట్టినప్పుడు తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతారు. ఏం చేయలేని పరిస్థితుల్లో వీరిని ఇంటికే పరిమితం చేస్తుంటారు.దీంతో ఈతరహా పిల్లలు నాలుగు గోడల మధ్య ఉండిపోతుంటారు. కాసింత ఆర్థిక స్థోమతు ఉన్న వారు తమ పరిధిలోని ప్రైవేట్ సంస్థలు నిర్వహించే స్కూళ్లలో జాయిన్ చేస్తుంటారు. కానీ పేదరికం మధ్య సతమతమయ్యే కుటుంబాలు ఇలాంటి సంస్థల్లో డబ్బులు చెల్లించి జాయిన్ చేయలేక ఇబ్బందులు పడుతుంటాయి. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో పిల్లల కోసం ఒకరు ఇంటి పట్టునే ఉండిపోతుంటారు. ఈ పరిస్థితులను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిత కేంద్రాలను రూపకల్పన చేశాయి. మానసికంగా,శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే బలమైన సంకల్పంతో 2013లో ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఇందుకోసం వనరులను సమకూర్చాయి.

ఇళ్లకు వెళ్లి మరీ శిక్షణ

ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఇంటికే పరిమితం కాకూడదనేది ప్రభుత్వ లక్ష్యం. ఇలాంటి పిల్లలకు ఎంతోకొంత సాయమందిస్తే కొంత ఫలితముంటుందనేది ఆచరణలో నిరూపణవుతోంది. అందుకే వీరికి అవసరమైన మానసిక, శారీరక థెరపీ అందిస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. మాటలు రాని, మానసికంగా ఎదుగుదల లేని పిల్లలు ఇళ్లలో ఉండిపోతే మానసికంగా మరింత కుంగిపోతారు. ఈ పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువస్తే అక్కడ ఆట పాటలు, ఇతర పరికరాలు వారిలో

జిల్లాలో భవిత కేంద్రాలు :	21
విభిన్న ప్రతిభావంతులు :	3633
పాఠశాలల్లో,భవిత కేంద్రాల్లో ఉన్నవారు :	494
వివిధ శిక్షణలు పొందుతున్నవారు :	1094
పనిచేస్తున్న ఫిజియోథెరపిస్టులు :	06
ఐఈఆర్‌టీలు : 33, ఆయాలు :	21

మానసిక ఉల్లాసానికి బాటలు వేస్తున్నాయి. ఇందులో పనిచేసే సిబ్బంది ఈ విషయంలో ఎంతో ఓపికగా పనిచేస్తూ పిల్లలకు రకరకాల శిక్షణ ఇస్తున్నారు. భవిత కేంద్రాలలో అవసరమైన ఫిజియోథెరపిస్టులను నియమించారు. కొంత మంది ఇల్లు కదలలేని పరిస్థితిలో ఉంటారు. అలాంటి పిల్లల కోసం వారానికి ఒకసారి ఇళ్లకు వెళ్లి మరీ సేవలు అందిస్తున్నారు.

తల్లిదండ్రులకు అలవెన్స్

పిల్లల తల్లితండ్రులలో చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు పడేవారే ఉంటారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకు రావడం వీరికి కష్టమైన పని. ప్రభుత్వం ఈవిషయాన్ని గుర్తించింది. పిల్లలను తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులకు కొంత అలవెన్స్ చెల్లిస్తోంది. అందరి విద్యార్థులు లాగే వీరికి కూడా జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక అందజేస్తోంది. దృష్టి ,వినికిడి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు తాజాగా సహిత విద్యను అందించేందుకు ప్రశస్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతే కాదు.. వీటి ద్వారా బోధించేందుకు ట్యాబ్‌లు కూడా మంజూరు చేసింది.

ట్యాబ్‌ల మంజూరు

దృష్టి, వినికిడి లోపం కలిగిన 6,7,8,9 తరగతులు విద్యార్థులకు ప్రత్యేక యాప్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి ద్వారా డిజిటల్ పద్ధతిలో బోధిస్తున్నారు. జిల్లాలో ఆయా కేటగిరిగిలకు చెందిన 190 మందిని గుర్తించి ట్యాబ్‌లు మంజూరు చేసింది. వీరిలో వినికిడి సమస్య ఉన్నవారు 142 మంది ఉన్నారు. దృష్టిలోపంతో బాధపడేవారు 28 మంది ఉండగా 20 మంది తక్కువ విజన్ కలిగి ఉన్నారు. ఇంటి వద్ద శిక్షణ పొందే వారి మరింత ప్రయోజనం చేకూరాలనే ప్రభుత్వం ప్రశస్త యాప్‌ను తీసుకొచ్చింది.

రకాల వైకల్యాలు నమోదు..

ప్రశస్త యాప్‌లో పిల్లల వివరాల నమోదు చేసేందుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. వీరిలోని వైకల్యాలను గుర్తించేందుకు 63 ప్రశ్నలు రూపొందించారు. దివ్యాంగుల చట్టం– 2016 ప్రకారం 21 రకాల వైకల్యాల గుర్తింపునకు ప్రశస్త యాప్ ఉపయోగపడుతోంది.

రూ.35,73లక్షలు విడుదల...

జిల్లాలోని భవిత కేంద్ర విద్యార్థులకు ప్రభుత్వం ఈ ఏడాది మేలో రూ.35.73లక్షలు పిల్లల ఖాతాల్లో జమచేశారు. ట్రాన్స్‌పోర్టు, హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్ట్, బాలికల ప్రత్యేక విద్య,స్టైఫండ్ పేరుతో ప్రభుత్వం ప్రోత్సహకాలను విడుదల చేసింది. రవాణా జిల్లాలో అలవెన్స్‌ల కోసం నెలకు రూ.3000 చొప్పున 406 మందికి ,ఎస్కార్ట్ అలవెన్స్‌గా 62 మందికి రూ.3వేల చొప్పున ,హోమ్‌బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్ కింద 210 మందికి రూ.3వేల చొప్పున, రీడింగ్ అలవెన్స్‌గా 21మందికి రూ.3వేల చొప్పున, గర్ల్ స్టైఫండ్ కింద 717మందికి రూ.2వేల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

దివ్యాంగ బాలలపై ప్రత్యేక శ్రద్ధ



ప్రతి దివ్యాంగుడిని విధిగా గుర్తించేలా అందరి సమన్వయంతో కృషిచేస్తున్నాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో లోపాలు గుర్తించేందుకు ఇప్పటికే ప్రశస్త యాప్ ద్వారా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పిల్లలకు సకాలంలో అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ పథకాల కింద లబ్ధి పొందేలా కృషి చేస్తున్నాం.
– సీహెచ్ నాగేశ్వరరావు, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్

సహిత విద్యతో సామర్థ్యం



వైకల్యం కలిగిన పిల్లలో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి లైఫ్ స్కిల్స్ నేర్పిస్తున్నారు. తద్వారా వారు తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం. జిల్లాకు మంజురైన ట్యాబ్‌ల్లో యాప్ ఇన్‌స్టాల్ చేస్తున్నాం. త్వరలో కలెక్టర్,ప్రజాప్రతినిధుల ద్వారా వీటిని అందజేస్తాం. – జి.నాగమణి, డీఈఓ.

జగనన్న విద్యాదీవెనతో రూ.27.43 కోట్లు లబ్ధి

- పథకం కింద ఆర్థిక సాయం జమ చేసిన ప్రభుత్వం
- జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా


జగనన్న విద్యాదీవెన మెగా చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా 40,397 మంది విద్యార్థులకు రూ.27.43 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా నగరిలో సోమవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ కృతికా శుక్లా, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి డీవీ రమణమూర్తి తదితరులతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజు మొత్తాన్ని జమ చేసిన అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఫీజు రీయంబర్స్‌మెంట్ మెగా చెక్‌ను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య ప్రాధాన్యాన్ని గుర్తించి ఈ రంగంలో విప్లవాత్మక కార్యక్రమలు, పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల పిల్లల ఉన్నత చదువులకు ఆర్థిక సమస్యలు అడ్డం కాకూడదని ముఖ్యమంత్రి జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని కెరీర్‌పరంగా ఉన్నతంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఇప్పటికే ఈ పథకాలను ఉపయోగించుకొని ఉన్నత విద్యా నైపుణ్యాలను పెంపొందించుకొని అధిక వేతన ప్యాకేజీలతో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు.

క్రమం తప్పకుండా ద్వారా లబ్ధి

జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని క్రమం తప్పకుండా ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు ఇచ్చేలా వారి తల్లుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమ చేస్తోందని కలెక్టర్ వివరించారు. పథకం కింద ఈ త్రైమాసికానికి జిల్లాలో వివిధ వర్గాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఆర్థిక సామయం జమ అవుతున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి డీవీ రమణమూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎ విజయశాంతి, వివిధ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు.

జిల్లాలో విద్యా దీవెన పథకం లబ్ధి వివరాలు

కేటగిరి	విద్యార్థులు	లబ్ధి (రూ.)
ఎస్సీ	6,203	4,49,62,365
ఎస్టీ	309	16,60,049
బీసీ	18,666	12,06,03,091
ఈబీసీ	2,689	2,18,73,085
ముస్లిం మైనారిటీ	529	37,32,604
కాపు	11,893	8,06,41,829
క్రిస్టియన్ మైనారిటీ	108	8,35,440
మొత్తం	40,397	27,43,08,473

చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

ఏలేశ్వరం: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో పట్టణంలో సోమవారం భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధరంగాల ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ నుంచి మెయిన్‌రోడ్ పలుప్రాంతాల మీదుగా ర్యాలీ జరిగింది. ర్యాలీలో వందలాదిగా ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ జెండాలు పట్టుకొని శాస్త్రవేత్తలకు సంఘీభావంగా నినాదాలు చేశారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్ ర్యాలీలోపాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయవంతంతో ప్రపంచస్థాయిలో మనదేశం ప్రథమస్థానం పొందిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల ఫలితంగా ప్రపంచంలో తొలిసారిగా చంద్రుడి విజయం సాధించామన్నారు. దేశం శాస్త్రవేత్తలకు రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, వివిధవర్గాల ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదేవుని శిఖర దర్శనం


స్వామివారి ఉత్తరం వైపు మెట్ల వద్ద నుంచి కనిపిస్తున్న సత్యదేవుని శిఖరం

అన్నవరం: సత్యదేవుని ఆలయ శిఖర దర్శనం..సర్వ పాపహరం అనే నానుడిని నిజం చేస్తూ భక్తులు స్వామివారి ఆలయ శిఖరాన్ని దర్శించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. సత్యదేవుని దర్శించిన భక్తులు స్వామివారి ఆలయ శిఖరాన్ని కూడా దర్శించేలా ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు భక్తులు సత్యదేవుని దర్శించి వెళ్లిపోయేవారు తప్ప ఆలయ శిఖరం దర్శనం చేయడానికి అవకాశం లేదు. దేవస్థానంలోని సత్యదేవుని దర్శనం, దిగువన యంత్రాలయం దర్శనం అనంతరం నేరుగా దర్బారు మండపం వద్దకు వచ్చేసేవారు. యంత్రాలయం పక్కకు వెళ్లడానికి కూడా వీలు లేకుండా అక్కడ బారికేడ్స్ ఉండేవి. ప్రస్తుతం ఆ బారికేడ్లను స్వామివారి ఆలయానికి ఉత్తరాన గల మెట్ల వద్దకు మార్చారు. భక్తులు మెట్ల వద్దకు వచ్చి స్వామివారి ఆలయ శిఖరం వైపు చూస్తే అక్కడ కలశాలు దర్శనమిస్తాయని ఈఓ తెలిపారు. మంగళవారం నుంచి భక్తులు స్వామివారి ఆలయ శిఖరాన్ని దర్శించేలా ఏర్పాట్లు చేశారు.

వంతెన నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు చెక్

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో రూ.10 కోట్లతో నిర్మించే వంతెనకు శంకుస్థాపన


గోకవరంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: స్థానిక ఠాణా సెంటర్‌లో ఉన్న బ్రిటిషు కాలం నాటి ఇరుకు వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించడం వలన ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జాతీయ రహదారి 516–ఇ విస్తరణలో భాగంగా ఠాణా సెంటర్‌లో ఊరకాలువపై రూ.10 కోట్లతో నిర్మించే వంతెన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ బ్రిటిషు కాలం నాటి ఈ వంతెన మీదుగా నిత్యం ఏజెన్సీలోని అనేక ప్రాంతాలకు, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు అనేక మంది రాకపోకలు సాగిస్తారన్నారు. వంతెన ఇరుకుగా ఉండటం వలన నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తమ దృష్టికి తీసుకురావడంతో వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ నిధులతో జాతీయ రహదారికి ఆనుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నూతన వంతెన నిర్మిస్తున్నట్టు తెలిపారు. పనులను నాణ్యతాపరంగా చేపట్టి డిసెంబర్ నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చురుగ్గా వ్యవహరిస్తున్నారని ఎంపీ కొనియాడారు. కాగా వంతెన నిర్మాణం వలన స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎంపీ వంగా గీతను కోరారు.


సంతమార్కెట్‌లో షెడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంటిబాబు

సంత మార్కెట్‌లో షెడ్లు నిర్మాణానికి భూమిపూజ

శతాబ్దాల చరిత్ర ఉన్న గోకవరం వారపు సంతలో షెడ్లు నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. పాత సంతమార్కెట్ స్థానంలో నూతనంగా నిర్మించే ఈ షెడ్లను త్వరితగతిన పూర్తి చేసి వ్యాపారస్తులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరసాల కుమారి, ఎస్సీసెల్ జోన్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, నాయకులు సుంకర వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం


విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైజ్ సంస్థ జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం కలెక్టరేట్‌లో బహుమతులు అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం, ఆంగ్ల మాధ్యమం అమలు, ట్యాబ్‌ల పంపిణీ తదితర ఎనిమిది అంశాలపై గూగుల్ ఫోరం ద్వారా పోటీలు నిర్వహించారు. విద్యార్థుల ప్రసంగ వీడియోలను రికార్డు చేసి నిర్వాహకులు అందించిన మార్గదర్శకాలను అనుసరించి వాటిని సమర్పించారు. ప్రైమరీ స్కూల్ నుంచి ఏలేశ్వరం మండలం తిరుమాలి మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఎం.నవ్యశ్రీ (4వ తరగతి), హైస్కూల్ నుంచి కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం గురుకుల పాఠశాలకు చెందిన మహాశ్రీ (10వతరగతి) ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. నాగులాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దుర్గరాజు (8వతరగతి), పిఠాపురం ఆంధ్రకేసరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన గంటా లక్ష్మీప్రసన్న (10వతరగతి) ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు.

తెలుగు.. అక్షరజ్యోతిలా వెలుగు..

- మన భాష అమృతతుల్యం
- ఈ భాషకు గ్రాంథిక సంకెళ్లు తెంచిన ఘనుడు గిడుగు
- నేడు ఆ మహనీయుని జయంతి.. తెలుగు భాషా దినోత్సవం


గిడుగు వెంకట రామమూర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/రాజానగరం: తీయందనాలు పంచే అమ్మ భాష.. మన తెలుగు చదివినా.. విన్నా.. మాట్లాడినా.. ఆ అక్షర ప్రవాహపు అందానికి భాషాప్రేమికులు మంత్రముగ్ధులవుతారు. ఆనంద రసార్ణవంలో మునిగి తేలుతారు. వెండి వెన్నెల జలపాతాల్లో.. అమృత ధారల్లో తడిసి ముద్దయిన అనుభూతికి లోనవుతారు. అంతటి అందమైన.. సమస్త భావస్ఫోరకమైన.. కమ్మనైన తెలుగు భాష మాట్లాడే అర్హత ఎంతో తపస్సు చేస్తేనే కానీ లభించదు. చారిత్రక, సాంస్కృతిక నగరమైన రాజమహేంద్రవరంలో గోదావరి ఒడ్డున తెలుగు ఆదికవి నన్నయ భట్టారకుడు మహాభారతాన్ని ఆంధ్రీకరించాడు. తదనంతర కాలంలో ఎంతో మంది కవులు, రచయితలు ఎన్నో విలువైన రచనలను గ్రాంథిక భాషలో వెలువరించారు. ఇవి పండితులకు తప్ప సామాన్యులకు అర్థం కాని పరిస్థితి. అటువంటి రోజుల్లో అమృతతుల్యమైన మన తెలుగు భాషను గ్రాంథిక చెర నుంచి విడిపించి.. వ్యావహారిక పథానికి తీసుకువచ్చిన ఘనుడు గిడుగు వెంకట రామమూర్తి. నాటి కవిపండితులు గ్రాంథిక భాషకు పట్టం కడుతున్న రోజుల్లో.. వ్యావహారిక భాష కోసం పరితపించి, ఉద్యమం నడిపిన ఘనుడు ఆయన. గిడుగు జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

> ఎంతో తపస్సు చేస్తేనే కానీ ఆంధ్ర దేశంలో పుట్టే అదృష్టం కానీ, ఆంధ్ర భాష నేర్చుకునే అదృష్టం కానీ లభించదు
> – అప్పయ్య దీక్షితులు

> సుందరమైన తెలుగు పాట పాడుతూ, సింధూ నదిలో పడవ నడుపు
> – సుబ్రమణ్య భారతి

> ఏ భాష చెణుకైన, ఏ యాస చినుకైన తనలోన కలుపుకొని తరలింది తెలుగు
> – డాక్టర్ సి.నారాయణరెడ్డి

రాజమహేంద్రవరం వేదికగా.. : పర్లాకిమిడిని ఒడిశా రాష్ట్రంలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ గిడుగు రామమూర్తి తన మకాం రాజమహేంద్రవరానికి మార్చారు. 'ఈ నగరంలోనే కవి పండితులు ఎక్కువ మంది ఉన్నారు. నా వ్యావహారిక భాషోద్యమానికి ఇదే సరైన వేదిక అవుతుంది' అని అన్నారు. చివరి వరకూ ఇక్కడే నివసించారు. వ్యావహారిక భాష వ్యాప్తి కోసం 'తెలుగు' అనే పత్రిక నడిపేవారు. వ్యావహారిక భాషోద్యమంలో భాగంగా రాజమహేంద్రవరంలో నాడు గిడుగు నిర్వహించిన భాషా సదస్సులో కందుకూరి వీరేశలింగం పంతులు పాల్గొన్నారు. గిడుగు వారి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. కందుకూరి సులభ గ్రాంథిక భాషలో రచనలు చేసినా, వ్యావహారిక భాషకు అడ్డు చెప్పలేదు. వ్యావహారిక భాషకు కూడా వ్యాకరణం ఉండాలని పేర్కొంటూ 'సంగ్రహ ఆంధ్ర వ్యాకరణం' అనే పుస్తకాన్ని కూడా కందుకూరి రచించారు. తాను రాస్తున్న సరళ గ్రాంథికం కంటే కూడా వ్యావహారిక భాషే ప్రజలకు అత్యంత చేరువవుతుందని ఆయన గ్రహించారు. కొక్కొండ వెంకటరత్నం, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి వంటి ఉద్దండ పండితులు గ్రాంథిక భాష తప్పదని హెచ్చరిస్తున్న రోజుల్లో కూడా గిడుగు రామమూర్తి, గురజాడ వెంకట అప్పారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి సాహితీవేత్తలు వ్యావహారిక భాషను సమర్థించారు. 'శ్మశానాల వంటి నిఘంటువులు దాటి.. వ్యాకరణాల సంకెళ్లు విడిచి.. ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి..' అంటూ మహాకవి శ్రీశ్రీ సైతం కవితావేశంతో మరింత చైతన్యం తీసుకువచ్చారు.

అంతా ఆంగ్లమయం : వ్యక్తి పరిపూర్ణంగా ఎదగడానికి తెలుగు సాహిత్యాన్ని మించిన సాధనం మరొకటి లేదు. అయితే, ఆధునిక అవసరాలకు తగినట్టుగా మన భాషను కూడా ఆధునీకరించాల్సిన ఆవశ్యకత ఉంది. సాంకేతికంగా, బోధనాపరంగా అనేక మార్పులు చేయాల్సి ఉంది. ఉదయం లేచి, రాత్రి నిద్ర పోయేంత వరకూ గుడ్ మార్నింగ్ నుంచి గుడ్ నైట్ వరకూ ప్రస్తుతం అంతా ఆంగ్లమయమే. తెలుగులో మాటలు కరువై వాట్సాప్‌లో తెలుగు, ఇంగ్లిష్ కలగలసిన టింగ్లిష్‌కే ప్రాధాన్యం లభిస్తోంది. మారుతున్న ప్రపంచంలో బతుకుతెరువు కోసం పర భాష తప్పనిసరి అయినా.. మాతృభాష పట్ల మమకారం ఎప్పటికీ సజీవంగా ఉండాలని నాటి తరం వారు, భాషా ప్రేమికులు ఆకాంక్షిస్తున్నారు.

తెలుగుకు ప్రాధాన్యం దక్కలేదు



దేశంలో భాషలు ఎక్కువ. పైగా 200 సంవత్సరాల యూరోపియన్ల ఆధిపత్యంలో మన భాషల ప్రాముఖ్యతనే కోల్పోయాం. అంతకు ముందు ఉర్దూ భాష ఏలింది. ఇక తెలుగు ఇళ్లల్లో మాట్లాడుకోవడానికే పనికి వచ్చింది. ఉమ్మడి మద్రాసు ప్రెసిడెన్సీలో కూడా తమిళానికి దక్కినంత ప్రాధాన్యం తెలుగుకు లభించలేదు. 'తెలుగు చాలా క్లుప్తంగా అన్ని విషయాలనూ అతి సమర్థవంతంగా వివరించగల సామర్థ్యం ఉన్న భాష. దీనికి భారతదేశ లింగ్వా ఫ్రాంకా(జాతీయ భాష)గా ఎంపిక చేయడానికి అన్ని అర్హతలూ ఉన్నాయి' అని జాతీయ భాష ఎంపిక కోసం నియమించిన హాల్డేన్ కమిషన్ ప్రశంసించింది. కానీ హిందీ ముందుకు వచ్చింది. తెలుగు ప్రాంతీయ భాషగా మిగిలిపోయింది. ఇంగ్లిష్ వారు ముద్రించిన రూపాయి నాణేలపై ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, తెలుగు భాషలే ఉండేవి. అంటే తెలుగుకు తొలి నుంచీ ప్రత్యేక గుర్తింపు, హోదా ఉన్నాయనే తెలుస్తోంది.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, తెలుగు పరిశోధకుడు, ఎస్‌కేవీటీ కళాశాల, రాజమహేంద్రవరం

రసామృతంలా ప్రవహించాలి



తెలుగు భాషా దినోత్సవం రోజున వాట్సాప్‌లో డీపీలు మార్చితే సరిపోదు. పిలుపుల నుంచి పలుకుల వరకూ తెలుగులోనే సాగాలి. తేటతెలుగు తీయదనాన్ని చవులూరించేలా అందరూ పలకాలి. నాలుకలపై వేమన పద్యాలు నాట్యం ఆడాలి. పండగల వేళ నాటక ప్రదర్శనలు, పాటలు, పద్యాలు.. ఇలా ఒకటేమిటి అన్నీ సాగిపోవాలి. తెలుగు భాష అగ్నిలా ప్రజ్వరిల్లి, రసామృతమై ప్రవహించి.. వాయువై శ్వాసించి.. గగనమంతటా వ్యాపించాలి. అప్పుడే నిజమైన తెలుగు భాషా దినోత్సవం.

– చాగంటి మాలతి, తెలుగు పండితురాలు, పురాణ ప్రవచనకర్త, రాజమహేంద్రవరం

తెలుగే కనిపించాలి.. వినిపించాలి



మన భాషను రక్షించుకోవాలి. భాష లేకపోతే జీవితం లేదు.. స్నేహితులు లేరు.. బంధువులు లేరు.. బలగమూ లేదు.. సమాజమూ లేదు.. సంస్కృతీ లేదు. భాష మన ప్రాణం, మన జీవనం. అందరూ తెలుగు మాట్లాడాలి, చూడాలి, చదవాలి, రాయాలి. అంతటా తెలుగే కనిపించాలి.. తెలుగే వినిపించాలి.

– డాక్టర్ కేఎస్ మూర్తి నాయుడు, ఇస్రో మాజీ సైంటిస్ట్

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత




దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు ఏనాడో చెప్పారు. అయితే కాలక్రమంలో ఆధునీకత పేరిట పరాయిభాషా పదాలు వచ్చి మన భాషలో విలీనమైపోతున్నాయి. ఈ తరుణంలో మన భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత మనది అనే భావం ప్రతి తెలుగు వారిలో కలగాలి. అది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. రేపటి తరానికి నేర్పించాలి. పిల్లలకు సంప్రదాయ పదాలు, సంబంధ బాంధవ్యాలు, మాండలిక పదాలు, సామెతలు, పొడుపు కథలు, పర్యావరణ పదజాలం, నూతన కల్పనాత్మక పదాలు, తెలుగు పదాల ఉచ్చారణలో కనబడే విశిష్ట పదజాలంపై అవగాహన కలిగించాలి. విశ్వవిద్యాలయాల్లో భాషా పీఠాలు ఏర్పాటు చేసి, పరిశోధనలను ప్రోత్సహించాలి.

– డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, అధ్యాపకులు, నన్నయ విశ్వవిద్యాలయం



మహాభారతం 'వజ్జ పంతి'లాంటిది



చిన్నప్పుడు కాపీ రైటింగ్ అని ఉండేది. కాపీ బుక్‌లో పైన ఉన్న వాక్యం చూసి మనం రాసేవాళ్లం. దానిని వజ్జ పంతి అనేవారు. అలాగే నన్నయ రచించిన మహాభారతం కూడా ఆయన తరువాతి తరాల రచయితలందరికీ 'వజ్జ పంతి'లా ఉపయోగపడుతోంది.

– బేతవోలు రామబ్రహ్మం, తెలుగు సంస్కృత పండితులు

తెలుగు భాషాభివృద్ధిలో 'నన్నయ'

'హంస' పురస్కారాల ప్రదానం

తెలుగు భాషాభివృద్ధికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తొలి నుంచీ తన వంతు కృషి చేస్తూనే ఉంది. వర్సిటీలోని తెలుగు విభాగం ఆధ్వర్యాన ఏటా తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగా కవితా గోష్ఠి, సదస్సు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవలనే 'ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు' కూడా ఘనంగా నిర్వహించారు. కాగా, ఈ ఏడాది కూడా రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ సహకారంతో యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సామాజిక, సాహిత్య రచనలు, కవిత్వం, అవధానం, మాతృభాషాభివృద్ధికి సాంకేతిక కృషి అనే ఐదు విభాగాల్లో విశిష్ట సేవలందించిన తొమ్మిది మందికి 'హంస' పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు. 'నన్నయ' ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్య అతిథులుగా పాల్గొంటారని రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ప్రముఖ సాహితీవేత్త శలాక రఘునాథశర్మ, విశిష్ట అతిథిగా ప్రముఖ సామాజిక సేవకురాలు, సాహితీవేత్త జక్కంపూడి విజయలక్ష్మి హాజరవుతారని పేర్కొన్నారు.

గోవిందా హరి గోవిందా..

- వాడపల్లిలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు
- శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతి.. వాడపల్లి దివ్యక్షేత్రం.. భక్తుల గోవింద నామోచ్చారణతో మార్మోగింది. ఇక్కడి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పారమాత్మికోపనిషత్ పూర్వక ప్రధాన హోమాలు, మహాపూర్ణాహుతి, స్వామి వారికి విశేష ఆరాధన, మహదాశీర్వాచనం తదితర వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో పూజాదికాలు నిర్వహించారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారిని ఉదయం ప్రత్యేక పూల మాలలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.


ప్రధాన హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు


ఉత్సవ మూర్తులతో ఊరేగింపుగా..

లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలకు..

- అందుకు నేనే ఉదాహరణ
- మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్దన్
- నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం


నాటి గురువులను సత్కరిస్తున్న 1984-86 బ్యాచ్ విద్యార్థులు, మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్దన్

కాకినాడ రూరల్: 'మాది పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం వద్ద అతి చిన్న గ్రామం. అత్యంత పేదరికం. చదువుకు ప్రాధాన్యం ఇస్తూ.. అప్పటి ఏయూ పీజీ సెంటర్ విద్యార్థిగా ఉన్నప్పుడు జీవితంపై ఒక లక్ష్యం ఏర్పరచుకున్నాను. ఉన్నత స్థాయికి ఎదగాలని కష్టపడ్డాను. ఐపీఎస్ సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి, నేడు మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ హోదాలో ఉన్నాను' అని ఐపీఎస్ అధికారి జనార్దన్ అన్నారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ఏయూ పీజీ సెంటర్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ 1984-86 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పూర్వ విద్యార్థి నిరీక్షణ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, మధ్యప్రదేశ్ అడిషనల్ డీజీపీ జనార్దన్, నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ, నమ్ముకున్న కష్టం, క్రమశిక్షణకు తోడు గురువులు నేర్పించిన మంచితనం తనను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాయని అన్నారు. విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వంటి పోటీ పరీక్షలకు ఏవిధంగా శిక్షణ తీసుకోవాలి, ఎటువంటి పుస్తకాలు చదవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు ప్రతి విద్యా సంస్థకు మార్గనిర్దేశక కార్యకర్తలుగా, తరువాతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ బ్యాచ్ విద్యార్థులు తమ గుర్తుగా మహిళా హాస్టల్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌కు రూ.70 వేలు, పురుషుల భోజనశాలలో బల్లలకు రూ.లక్ష చొప్పున ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారికి విరాళం అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా రూ.లక్ష అందిస్తామని చెప్పారు. 1996కు సంబంధించి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు జి.శ్యామ్ మాట్లాడుతూ, తన తరఫున ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తానని ప్రకటించారు. అనంతరం నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతి, విజయవాడ ఏసీపీ పి.భాస్కరరావు, విశ్రాంత ఏయూ ప్రొఫెసర్లు విశ్వనాథరావు, వెంకటరత్నం, దోసగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలకు రూ.10 లక్షల సాయం


కలెక్టర్ హిమాన్షు శుక్లాకు రూ.10 లక్షల చెక్కు అందిస్తున్న గెయిల్ అధికారులు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వరద సహాయక చర్యల కోసం గెయిల్ సంస్థ రూ.10 లక్షల ఆర్థిక సాయం సమకూర్చింది. ఈ మేరకు చెక్కును కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు గెయిల్ అధికారులు సోమవారం అందజేశారు. రాజమహేంద్రవరం గెయిల్ ఓఐసీ కేవీఎస్ రావు, జనరల్ మేనేజర్ వైఏ కుమార్, హెచ్ఆర్ అధికారి ప్రభాకర్, సీఎస్ఆర్ మేనేజర్ బాలాజీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాగల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఏఎస్సై ఎస్ఏఏ హుస్సేన్ కథనం ప్రకారం.. ఐ.పంగిడి గ్రామానికి చెందిన మడిచర్ల గంగ (46) ఈ నెల 25న తన ఇంట్లో అద్దెకుంటున్న కాపెల్లి వెంకటకృష్ణ మోటార్ సైకిల్‌పై కోటసత్తెమ్మ గుడికి వెళ్తోంది. మార్గం మధ్యలో ఎస్.ముప్పవరం వద్ద ఓ కుక్క అకస్మాత్తుగా అడ్డం వచ్చింది. బైక్‌కు సడన్ బ్రేక్ వేయడంతో గంగ రోడ్డుపై పడిపోయి, తలకు బలమైన గాయమైంది. ఆమెను తొలుత నిడదవోలు, అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంగ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2 లక్షల నగదు బ్యాగ్ చోరీ

గోకవరం: ఓ మహిళ వద్ద భారీ నగదుతో ఉన్న బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఎస్సై యూవీ శివనాగబాబు కథనం ప్రకారం.. గోకవరానికి చెందిన హంసబర్గుల కాశమ్మ సోమవారం ఉదయం ఇండియన్ బ్యాంక్‌లో రూ.లక్ష విత్‌డ్రా చేసింది. అనంతరం సమీపంలోని జాంపేట కో ఆపరేటివ్ బ్యాంక్ ఏటీఎంలో రూ.లక్ష విత్‌డ్రా చేసింది. మొత్తం రూ.2 లక్షల నగదును ఒక బ్యాగులో పెట్టుకుని నడిచి వెళ్తోంది. వినాయకుని ఆలయం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి, ఆమె చేతిలోని బ్యాగ్ లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

అనపర్తి: వ్యక్తిగత సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పి.అప్పారావు కథనం ప్రకారం.. స్థానిక ఇందిరా నగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో ఉన్న ఫ్లాట్‌లో ఈ సంఘటన జరిగింది. శ్రీకాకుళం జిల్లా మధురవాడ గ్రామానికి చెందిన మద్దు ధర్మరాజు(36)కు అనపర్తికి చెందిన ఓ వివాహితతో పరిచయమైంది. ఈ నేపథ్యంలో వారిద్దరూ కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. అయితే, అప్పటికే ధర్మరాజుకు తన ప్రాంతానికి చెందిన మరో మహిళతో వివాహమైంది. ఇదిలా ఉండగా మద్యానికి బానిస కావడంతో సహజీవనం చేస్తున్న మహిళతో ధర్మరాజుకు ఇటీవల మనస్పర్థలు తలెత్తాయి. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధర్మరాజు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అప్పారావు తెలిపారు.


ఆత్మహత్యకు పాల్పడిన ధర్మరాజు

పంట కాలువలో వ్యక్తి మృతదేహం

కాట్రేనికోన: పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో కుండలేశ్వరం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. మృతుడికి సుమారు 36 ఏళ్ల వయసుంటుందని అంచనా వేస్తున్నారు. బహిర్భూమికి వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తూ పంట కాలువలోకి జారిపడి మరణించాడా లేక ఇతరత్రా కారణాలేవైనా ఉన్నాయా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.